

వారంలోగా డబ్బు చెల్లించాలి

- ఎన్నికల విధుల డబ్బు చెల్లించకపోవడంపై జనగామ జిల్లా కలెక్టర్ ఆరా!
- త్వరగా చెల్లించాలని ఆర్డీవో, తహసీల్దార్‌కు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, జూలై 21 : జనగామ నియోజకవర్గ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించాల్సిన ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి అందించాల్సిన గౌరవ వేతనం, టీఏ, డీఏలను ఇప్పటికీ చెల్లించని విషయమై జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌పాషా ఆరాతీశారు. ఎన్నికలు పూర్తయి నెలన్నర గడిచినప్పటికీ కేవలం జనగామ నియోజకవర్గంలోనే డబ్బు చెల్లించని విషయమై ఆంధ్రజ్యోతిలో "ఎన్నికల పైసలు ఇంకెప్పుడిస్తారో" శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ పాషా స్పందించారు. కేవలం జనగామలోనే చెల్లించకపోవడం ఏంటని ఆరాతీశారు. వారంరోజుల్లోగా సమస్య పరిష్కరించి డబ్బు అందించాలని జనగామ ఆర్డీవో, ఏఆర్‌వోలను ఆదేశించారు. తహసీల్దార్, సెక్టోరియల్ అధికారులు, సిబ్బందిలో ఆశలు సజీవంగా నిలిచాయి. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' కథనం ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశమైంది.



సిద్దిపేటలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, అర్చనలు, సామూహిక పారాయణాలు చేశారు.

8 లో

ముసురేసింది



ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

- జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన
- స్తంభించిన జనజీవనం
- ఊపందుకున్న పొలం పనులు
- వర్షంలోనే నాట్లు వేసిన రైతులు
- మద్దూరులో అత్యధికంగా 44, వర్గల్‌లో అత్యల్పంగా 11.6 మిల్లీమీటర్ల వర్షపాతం

సిద్దిపేటఅగ్రికల్చర్/సిద్దిపేటటౌన్/మద్దూరు/చిన్నకోడూరు/హుస్నాబాద్/కోహెడ జూలై 21: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ధోరణి వల్ల జిల్లా వ్యాప్తంగా ముసురేసింది. మోస్తరు నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.



సిద్దిపేటలో రెయిన్ కోట్, గొడుగు సహాయంతో వెళ్తున్న పట్టణవాసులు

జిల్లావ్యాప్తంగా 22.4 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లావ్యాప్తంగా సగటున 22.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక, జిల్లాలో అత్యధికంగా మద్దూరులో 44, అత్యల్పంగా వర్గల్ మండలంలో 11.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోహెడలో 43, అక్కన్నపేటలో 34.4, దూల్మిట్టలో 31.2, హుస్నాబాద్‌లో 30.2, చేర్యాలలో 26.4, కొండపాకలో 25, నంగునూరులో 24.6, తొగుటలో 24.4, కొమురవెల్లిలో 22.2, దౌల్తాబాద్ 22, దుబ్బాకలో 19.4, బెజ్జంకి, జగదేవ్‌పూర్‌లో 18.4, ములుగు మండలంలో 17.6, సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాల్లో 16, మర్కుక్‌లో 16.8, రాయపోల్‌లో 16.2, మిరుదొడ్డి, నారాయణరావుపేటలో 14.2, చిన్నకోడూరు 15.6, గజ్వేల్‌లో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షంలోనే వరి నాట్లు

ఇన్ని రోజులు వర్షాలు లేక వరి నారు ముదురుతుండడంతో ఆందోళనలో ఉన్న రైతాంగానికి ఊరట లభించింది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు పొలంబాట పట్టారు. దున్నకం, వరినాట్లు పనులు ఊపందుకున్నాయి. పత్తి రైతులు పంటకు ఎరువులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. పలువురు రైతులు వర్షంలోనే వరి నార్లు తీస్తుండగా.. ఇంకొందరు రైతులు నాట్లు వేస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రమంతా వర్షపాతం ఉన్నందున సిద్దిపేట పట్టణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, కమిషనర్ ప్రసన్నరాణి తెలిపారు. హెల్ప్‌డెస్క్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని చెప్పారు. మున్సిపల్ సంబంధిత సమస్యలు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్ 9505507248 కు కాల్‌చేయాలని సూచించారు. అధికారులు అ ప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ప్రజలు శిథిలావస్థలకు చేరిన ఇళ్లలో ఉండకూడదని, వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. శిథిలావస్థకు చేరిన గృహాల వివరాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది గుర్తించాలని వారు ఆదేశించారు.



సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వాన



కోహెడ మండలం వింజపల్లిలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి

దౌల్తాబాద్ : దౌల్తాబాద్ మండల పరిధిలోని వేర్వేరు గ్రామాల్లో పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతిచెందాయి. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గొడుగుపల్లి గ్రామానికి చెందిన రైతు మద్దెల సుధాకర్ శనివారం సాయంత్రం తన రెండు ఎడ్లను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా ఒక ఎద్దు చనిపోయి ఉంది. లింగాయిపల్లి తండాకు చెందిన గుగులోతు లలిత తన పశువుల పాకలో ఎడ్లను కట్టేసింది. పశువుల పాకపై పిడుగుపడి ఎద్దు మృతిచెందింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.



గొడుగుపల్లిలో పిడుగుపడి చనిపోయిన ఎద్దు

ముసురు ఎఫెక్ట్.. తగ్గిన భక్తుల తాకిడి



చేర్యాల: ముసురు కారణంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కానరాలేదు. ప్రతీ ఆది, బుధవారాల్లో వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షం ముసురు కారణంగా ఆదివారం మల్లన్నఆలయానికి ఆశించినమేర భక్తులు చేరుకోలేదు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపొందిన తరువాత తీన్మార్ మల్లన్న ఆదివారం తొలిసారి జనగామ నియోజకవర్గపర్యటన చేపట్టారు. ఈసందర్భంగా కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని సందర్శించి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్న అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. కాగా పోతిరెడ్డిపల్లి నుండి పెద్దరాజుపేట వరకు బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ సీపీఐ నాయకులు ఎమ్మెల్సీ మల్లన్నకు వినతిపత్రం అందించారు.



వర్షంలోనే పొలం పనులు చేపడుతున్న రైతులు



చిన్నకోడూరులో కురుస్తున్న వర్షం

బదిలీల పరంపర



గజ్వేల్, జూలై 21: జిల్లాలో పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ ఇన్‌చార్జి కమిషనర్ మంత్రిప్రగడ హనుమంతరావు ఉత్తర్వులను జారీ చేశారు. తొగుట ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎంకే వనజ ములుగుకు, కొహెడలో విధులు నిర్వహిస్తున్న ఎన్.మహిపాల్‌రెడ్డి సిద్దిపేట జడ్పీ కార్యాలయానికి, వర్గల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్.వెంకట్‌రెడ్డి జగదేవ్‌పూర్‌కు, చిన్నకోడూరు లో పని చేస్తున్న బి.పరుశరాములు కొండపాకకు, ములుగులో విధులు నిర్వహిస్తున్న జె.నర్సింహులును వర్గల్‌కు బదిలీ చేశారు. ఇక కొండపాకలో పనిచేస్తున్న బి.ప్రసన్నకుమారి చిన్నకోడూరుకు, జడ్పీ కార్యాలయంలో పనిచేస్తున్న గౌసోద్దీన్ తొగుటకు, గజ్వేల్‌లో పనిచేస్తున్న ఎస్.రాజశేఖర్‌రెడ్డి టీఎన్‌జీవో కార్యాలయ ఆఫీస్ బేరర్‌గా, జగదేవ్‌పూర్‌లో పనిచేస్తున్న సయ్యద్ మజహర్ హుస్సేన్ నంగునూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు.

పలువురు ఎంపీడీవోలు

జిల్లాలో పలువురు ఎంపీడీవోలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ ఇన్‌చార్జి కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులను విడుదల చేశారు. ఆదిలాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం.మురళీధరశర్మను సిద్దిపేట జిల్లాకు, రాజన్న-సిరిసిల్లా జిల్లాలో పనిచేస్తున్న భాస్కరశర్మను సిద్దిపేట జిల్లాకు బదిలీ చేశారు. నిజామాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న కె.ప్రవీణ్‌ను సిద్దిపేట జిల్లాకు బదిలీ చేయగా, సిద్దిపేట జిల్లాలో పనిచేస్తున్న ఉమాదేవిని మెదక్ జిల్లాకు బదిలీ చేశారు.

తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ల కేటాయింపు

జిల్లాలో పలువురు తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులను జారీ చేశారు. భద్రాద్రి-కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తున్న పి.చంద్రశేఖర్ స్పౌజ్ గ్రౌండ్‌లో సిద్దిపేట జిల్లాకు రాగా, రాజన్న-సిరిసిల్లా జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సింహాచలం మధుసూదన్ సిద్దిపేట జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇక సిద్దిపేట జిల్లాలో పని చేస్తూ ఇతర జిల్లాకు వెళ్లాల్సిన ఎస్.మధుసూదన్ స్పౌజ్ గ్రౌండ్‌లో సిద్దిపేట జిల్లాకు కేటాయించబడ్డారు. రాజన్న జోన్‌లో భాగంగా జరిగిన బదిలీల్లో కామారెడ్డిలో పనిచేస్తున్న బుక్యా శ్రావణి సిద్దిపేటకు బదిలీపై రాగా, రాజన్న-సిరిసిల్ల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న దూస అరవింద్ సిద్దిపేట జిల్లాకు స్పౌజ్ గ్రౌండ్‌లో బదిలీపై వచ్చారు. సిద్దిపేట జిల్లాలో పనిచేస్తున్న జహీర్ మెదక్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

గజ్వేల్ మండలంలో..

గజ్వేల్ : గజ్వేల్ మండలంలో నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వర్గల్ మండలం అవుసులోనిపల్లికి, శ్రీగిరిపల్లి పంచాయతీ కార్యదర్శి మల్లీశ్వరి సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లికి, బయ్యారం గ్రామ కార్యదర్శి నరేశ్ దుబ్బాక మండలం ఎనగుర్తికి, కొల్గూరు గ్రామ కార్యదర్శి వి.సంధ్య బయ్యారం గ్రామానికి బదిలీ అయ్యారు. పిడిచెడ్‌కు వర్గల్ మండలం జబ్బాపూర్ పంచాయతీ కార్యదర్శి కల్పన, శ్రీగిరిపల్లికి జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ పంచాయతీ కార్యదర్శి వేణు బదిలీపై వచ్చారు. మక్తమాసాన్‌పల్లి గ్రామానికి ఇంకా ఎవ రూ రిపోర్ట్ చేయలేదని ఎంపీడీవో కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పంచాయతీ సిబ్బందికి గుడ్‌న్యూస్

- సిబ్బంది పెండింగ్ జీతాలకు మోక్షం
- 952 కార్మికులకు రూ.11.75 కోట్లు విడుదల
- రెండు, మూడురోజుల్లో కార్మికుల ఖాతాల్లో జమ



పెండింగ్ వేతనాలు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది (ఫైల్)

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 21: పెండింగ్‌లో ఉన్న పంచాయతీ సిబ్బంది వేతనాలకు మోక్షం లభించింది. జిల్లాలో 499 గ్రామపంచాయతీలున్నాయి. కొన్ని గ్రామపంచాయతీల్లో 13నెలలుగా, మరికొన్నింటిలో ఆరు నెలలుగా, ఇంకొన్నింటిలో మూడు నెలలుగా సిబ్బంది వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వారి వేతనాలను విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు.

952 కార్మికులకు రూ.11.75 కోట్లు విడుదల..

గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడం పంచాయతీ కార్యదర్శులకు, స్పెషల్ ఆఫీసర్లకు తలనొప్పిగా మారింది. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, జడ్పీటీసీ సభ్యులు పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని డీపీవోను నిలదీశారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న 952 కార్మికులకు చెల్లించాల్సిన రూ.11.75 కోట్లను విడుదల చేసింది. తక్షణమే జీతాలు చెల్లించాలని డీపీవో ఆదేశాలు అందాయి. ఈ మేరకు సిబ్బంది ఖాతాలో వేతనాలు జమ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మరో రెండు మూడు రోజుల్లో సిబ్బందికి ఖాతాలో జమ కానున్నాయి. ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని, స్పెషల్ ఆఫీసర్లకు టోకెన్లు చేయమని ఆదేశాలు ఇచ్చామని డీపీవో దేవకీ దేవి తెలిపారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని విద్యార్థిని ఆత్మహత్య



చేగుంట, జూలై 21: సెల్‌ఫోన్ కొనివ్వలేదన్న మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. మెదక్ జిల్లా చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన మ్యాకల రుచిత(18) మెదక్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నది. హస్టల్‌కు వెళ్తానని, తనకు కొత్త ఫోన్ కొనివ్వాలని తండ్రి స్వామిని కోరింది. తర్వాత ఇప్పిస్తానని నచ్చజెప్పి తండ్రి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఇంటికి వచ్చిచూసేసరికి రుచిత దూలానికి వేలాడుతూ ఉన్నది. సమాచారం అందుకున్న పోలీసులు రుక్మాపూర్ గ్రామానికి చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు.

నాలుగు మండలాలను జనగామలో కలిపేందుకు కృషి

● స్థానిక ఎన్నికల్లో కార్యకర్తల గెలుపునకు కృషి
● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

చేర్యాల, జూలై 21 : కొమురవెల్లి మల్లన్న ఆలయంతో పాటు తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిని అక్రమంగా దోచుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయంగా సిద్దిపేట జిల్లాలో విలీనం చేసుకున్న చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలను జనగామ జిల్లాలో కొనసాగించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. చేర్యాల పట్టణంలోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి త్వరలో కార్యాచరణ చేపట్టి అస్తిత్వ పరిరక్షణకు పాటుపడతామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజానీకాన్ని అరిగోస పెట్టిందని, ఆలయాలను సైతం దోచుకోవడం వీడలేదన్నారు. యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి, భద్రాచలం రామాలయం, కొమురవెల్లి మల్లన్న ఆలయాలను పూర్తిగా దెబ్బతీసిందన్నారు. నాలుగు మండలాలను సిద్దిపేట జిల్లాలో విలీనం చేసుకుని అన్యాయం చేశారని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలో కొనసాగడం కొమురవెల్లి మల్లన్నకు కూడా ఇష్టంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ఇతరత్రా సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో జనగామ నియోజకవర్గంలో అన్ని స్థానాలలో కాంగ్రెస్ విజయం కైవసం చేసుకునే విధంగా పార్టీశ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తాము అండగా ఉంటామన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దొంగ ఓట్లు, నోట్లతో గెలిచినందున అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తన ఎమ్మెల్సీ నిధులను ఈప్రాంతానికి తప్పక కేటాయించి మౌలిక వసతుల కల్పనకు పాటుపడతానన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ తదితరులు తీన్మార్ మల్లన్నను శాలువా కప్పి సత్కరించారు. అంతకుముందు కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో కాసేపు కార్యకర్తలతో ముచ్చటించారు. బీదకుటుంబానికి చెందిన దివ్యాంగులు నాగమల్ల శ్రీనివాస్-సువర్ణల దీనస్థితిని మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి వివరించి ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్సీ మల్లన్న హైదరాబాదులోని తన కార్యాలయానికి తీసుకురమ్మని, తగిన సహాయమందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, గిరి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ఎమ్మెల్సీ మల్లన్నను సన్మానించిన కాంగ్రెస్ నేతలు

జగదేవ్‌పూర్, జూలై 21: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదివారం కొమురవెల్లి మల్లన్న దర్శనం కోసం కొండపోచమ్మ రోడ్డు గుండా వెళ్తుండగా జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పల ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లన్నను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, యువ నాయకులు లోకేష్, మనోజ్, కరుణాకర్, వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చిన్నకోడూరు, జూలై 21: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలతో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని కమ్మర్లపల్లి ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బద్ధిపడగ రాజయ్య (60) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి పని నిమిత్తం ఇంటి నుంచి బయలుదేరి గ్రామంలోని రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి ఇల్లంతకుంట వేగంగా వెళ్తున్న కారు అతడిని వెనక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాజయ్యను కుటుంబసభ్యులు ఓ ప్రైవేయిట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఆదివారం మృతుడి కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెజ్జంకి మండలం గుండారం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ అజయ్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య ఎల్లవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గజ్వేల్‌లో యువకుడు...

గజ్వేల్, జూలై 21: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మర్కంటి శ్రావణ్‌కుమార్(19)ని తన తండ్రి వ్యవసాయ పనులు చేయాలని మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. అంతేకాకుండా తల్లి సైతం అనారోగ్య సమస్యతో బాధపడుతుండడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 6వ తేదీన తన పొలం వద్ద గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు శ్రావణ్‌కుమార్‌ను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.సైదా తెలిపారు.

ఎడతెరిపి లేని వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



ఘనపురం ఆనకట్టను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట, జూలై 21 : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం ఆయన ఘనపురం ఆనకట్టను సందర్శించారు. ఆనకట్ట వద్ద అవసరమైన బందోబస్తు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆనకట్ట పైకి ఎక్కకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ నరేష్, ఏఎస్సై సంగన్న, కానిస్టేబుల్ ప్రవీణ్ తదితరులున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఆరుగురి అరెస్ట్ రూ. 37.500, రెండు కార్లు స్వాధీనం



నిందితులను చూపుతున్న పోలీసులు

కుకునూరుపల్లి, జూలై 21: పేకాట స్థావరంపై కుకునూరుపల్లి పోలీసుల దాడి చేసి నగదు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్న ఘటన ఆదివారం మంగోల్ గ్రామంలో జరిగింది. తొగుట సీఐ లతీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగోల్ గ్రామానికి చెందిన యేళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఇంటిలో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారంతో కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి దాడి చేయగా షాహిత్, అంబేద్, రాయణరెడ్డి, లగిశెట్టి రవీందర్, దాసరి బాబు, ముషణం నాగరాజు పేకాట ఆడుతూ పట్టుబట్టారు. వారి వద్ద నుంచి రూ.37,500 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ లతీఫ్ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూఎన్ మిషన్‌కు వెంకటాపూర్ జవాను ఎంపిక



బొక్కి వెంకటేష్

మర్కుక్, జూలై 21: మండలంలోని శివారు వెంకటాపూర్‌కు చెందిన బొక్కి వెంకటేష్ 2018లో ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం 19 మద్రాస్ పేరెంట్ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అతడు యూఎన్ మిషన్‌లో భాగంగా ఈ నెల చివరలో ఆఫ్రికా ఖండంలోని లెబరెన్ దేశానికి వెళ్లే బెటాలియన్‌లో చోటు సంపాదించుకున్నాడు. సెలవుపై సొంతూరుకు వచ్చిన తనకు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా ఉన్నతాధికారులు చెప్పారని, దేశం నుంచి ప్రపంచ శాంతి కోసం పనిచేయబోతున్నందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు.

భూ వివాదంలో
ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌పై గొడ్డలితో దాడి

- తలకు స్వల్పగాయం
- దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు


గాయపడిన రవీందర్

హుస్నాబాద్‌రూరల్, జూలై 21: హుస్నాబాద్ మండలం రాములపల్లి గ్రామంలో భూవివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగి ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌పై ముగ్గురు వ్యక్తులు గొడ్డలితో దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాములపల్లి గ్రామంలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌కు వ్యవసాయ భూమి ఉంది. తన పొలానికి వెళ్లేందుకు దారి కోసం రైతులు పుల్ల అయిలయ్య, నాగరాజు, కనకవ్వ అడ్డుపడుతున్నారు. ఈ విషయం పెద్దమనుషులతో పంచాయితీ కొనసాగుతోంది. ఆదివారం ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ నాయిని రవీందర్ ట్రాక్టర్‌తో పొలం దున్నేందుకు వెళుతుండగా అయిలయ్య, నాగరాజు, కనకవ్వ అడ్డుపడి గొడ్డలితో దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ తలకు స్వల్ప గాయం కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన అయిలయ్య, నాగరాజు, కనవ్వపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

సౌదీలో సిద్దిపేట జిల్లా వాసి మృతి

- మృతదేహం కోసం కుటుంబసభ్యుల ఎదురుచూపు


రాగి రవి(ఫైల్)

బెజ్జంకి, జూలై 21 : అనారోగ్యంతో సౌదీలో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల వాసి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బేగంపేటకు చెందిన రాగి రవి(55) పదహారు సంవత్సరాల క్రితం కుటుంబపోషణ కోసం సౌదీ వెళ్లాడు. సంవత్సరన్నర క్రితం స్వగ్రామానికి వచ్చి మళ్లీ వెళ్లాడు. ఈనెల 13వ తేదీన సౌదీలో అనారోగ్యంతో మృతిచెందాడు. పది రోజులుగా మృతదేహం కోసం కుటుంబసభ్యులు ఎదురుచూస్తున్నారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


చాకలి ఎల్లం(ఫైల్)

చేగుంట, జూలై 21 : కుటుంబ కలహాలతో యువకుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చేగుంట మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన చాకలి ఎల్లం(23) 15 రోజుల క్రితం ఇంట్లో చిన్న గొడవ జరగడంతో గడ్డి మందును సేవించాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యుల గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

గుర్రంను ఢీకొన్న కారు..
ఎదురుగా వస్తున్న మరో రెండు కార్లు ఢీ

- 12 మందికి గాయాలు

కౌడిపల్లి, జూలై 21: గుర్రంను కారు ఢీకొనగా ఎదురుగా వస్తున్న మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొనడంతో పన్నెండు మందికి గాయాలు అయిన సంఘటన కౌడిపల్లిలోని పెద్ద కల్వర్టు వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ వైపు నుంచి నర్సాపూర్ వైపునకు గుర్రం వెళ్తుండగా నర్సాపూర్ నుంచి మెదక్ రోడ్డు వైపు వస్తున కారు గుర్రంను ఢీకొన్నది. ఆసమయంలో మెదక్ వైపు నుంచి వస్తున్న కారు గుర్రంను ఢీకొన్న కారును బలంగా గుద్దుకున్నది. అదే సమయంలో వెనుక వస్తున్న మరో రెండు కార్లు ఒకదానివెనుక ఒకటి ఢీకొన్నాయి. మూడు కార్లు ఢీకొనగా గుర్రం వెంట ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలై కాలు విరిగింది. గుర్రం కాలు విరిగింది. ప్రమాదంలో కారులలోని అబ్దుల్ ఆసీఫ్, అబ్దుల్ రహీం, ఆసీఫా బేగం, పార్షా అఫ్మాద్, సోయాబ్ అసన్, తో పాటు మరో ఏడు మందికి గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. మూడు కార్లు ఏకకాలంలో ఢీ కొనడంతో జాతీయ రహదారి 765డిపై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.


కౌడిపల్లిలోని జాతీయ రహదారి 765డిపై ఢీకొన్న మూడుకార్లు

బీఎంఎస్‌తోనే మెరుగైన వేతన ఒప్పందం

- బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, జూలై 21: బీఎంఎస్ ద్వారానే మెరుగైన వేతన ఒప్పందం సాధ్యమని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.ప్రదీప్‌కుమార్ అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. కార్మికులే కార్మిక నాయకుడిగా ఉండాలని బీఎంఎస్ వ్యవస్థాపకుడు దత్తోపంత్ హెగ్డే చెప్పారని గుర్తుచేశారు. 23న అన్ని పరిశ్రమల వద్ద మండల కేంద్రాల్లో బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



మెదక్‌లో బోనాల ఊరేగింపులో మహిళలు, సిద్దిపేట కోటిలింగాల సమీపంలో బోనాలతో భక్తులు

భక్తిపారవశ్యంతో బోనాలు

కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు.. బోనం సమర్పించి మొక్కులు చెల్లించిన భక్తులు

ఆషాఢమాసం మూడో ఆదివారంను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి. ఏడుపాయల వనదుర్గామాత ఫలాంబరీ అలంకరణలో దర్శనమివ్వగా, మర్పడగ విజయదుర్గామాతను శాకంబరీదేవిగా అలంకరించారు. ఆయా ప్రాంతాల్లో బోనాలను ఘనంగా నిర్వహించారు.

మెదక్ అర్బన్, జూలై 21 : ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మెదక్ హౌసింగ్ బోర్డు కాలనీలో నల్లపోచమ్మ తల్లికి పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాలను సమర్పించారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పువప్పుళ్ల, పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాల నడుమ పిల్లాపాపలతో ఊరేగింపుగా ఆలయానికి చెరుకున్నారు. బోనం నివేదించి మొక్కు తీర్చుకున్నారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంకిష్టయ్య అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ముదిరాజ్ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, బండ నరేందర్, గోపాలకృష్ణ మూర్తి, అక్షయ్‌కుమార్, దశరథ్, ఆది సురేందర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో కనులపండుగగా

నారాయణఖేడ్ : కట్ట మైసమ్మ బోనాల పండుగ సందర్భంగా నారాయణఖేడ్ పట్టణం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక అభిషేకాలు, అమ్మవారికి అలంకరణ, లలిత సహస్రనామాల పఠనము, మహాహారతి, మహానైవేద్యం, తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పట్టణ వీధుల గుండా బోనాల ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల నృత్యం విశేషంగా ఆకట్టుకున్నది. నెహ్రూనగర్, అంబేద్కర్, రాజీవ్‌చౌక్, అప్పారావుషెట్కార్ వీధుల మీదుగా ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు ప్రభాకర్, సాయిసంగమేశ్వర్, రాఘవేందర్‌రావు, రవి, దశరత్ కురుమ, నగిరేశం, దుర్గేష్, తదితరులుపాల్గొన్నారు.



జహీరాబాద్‌లో బోనాలతో మహిళలు, నారాయణఖేడ్‌లో బోనాల ఊరేగింపులో పోతురాజు



శాకాంబరీదేవిగా విజయదుర్గామాత

కొండపాక, జూలై 21 : కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా విజయదుర్గామాత శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విజయదుర్గా ఉపాసకులు చెప్పెల హరినాథశర్మ మాట్లాడుతూ గురు పౌర్ణమి రోజున గురుమండల రూపిణిగా అమ్మవారిని అర్చించుకోవడం విశేషమన్నారు. శాకంబరీదేవిగా దర్శించుకోవడం వల్ల భక్తులకు సర్వసౌభాగ్యాలు కలుగుతాయని తెలిపారు.

జహీరాబాద్‌లో ఎమ్మెల్సీ బల్మూరి పూజలు

జహీరాబాద్ : జహీరాబాద్ పట్టణంలోని గడీ, మాణిక్ ప్రభు మహేశ, రాంనగర్, ఆర్యనగర్ తదితర ప్రాంతాల్లో బోనాలను వైభవంగా నిర్వహించారు. మహి ళలు బోనాలను నెత్తిన పెట్టుకుని సమీప ప్రాంతాల్లోని ఊరడమ్మ, దుర్గమ్మ, పోచమ్మ తదితర ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ప్రత్యేక పూజలను నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ డీసీసీబి చైర్మన్ జైపాల్‌రెడ్డి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ఊరడమ్మ తల్లికి జలాభిషేకం

రాయికోడ్ : రాయికోడ్‌లోని గ్రామ దేవత ఊరడమ్మతల్లికి బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య ఊరి శివారులోని వాగు నుంచి గంగ జలాన్ని తెచ్చి అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శిఖర స్థాపన చేశారు. పురవీధుల గుండా ఊరేగింపుగా వచ్చి మహిళలు ఊరడమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఒడిబియ్యం పోసి, నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పటాన్‌చెరులో పోచమ్మ బోనాలు

పటాన్‌చెరు : పటాన్‌చెరు పట్టణ శివారులోని నందన్‌రతన్ ప్రైడ్ కాలనీలో ఆషాఢ బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక పోచమ్మ ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులు పోచమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు సజావుగా సాగేందుకు జీహెచ్ఎంసీ తరఫున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం నిర్వహణకు సిబ్బందిని నియమించామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు రమణారెడ్డి, అశోక్, నవీన్‌రెడ్డి, శ్యాం, సత్యనారాయణ, అజ్మత్, చంద్రశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో పోచమ్మకు పూజలు

గుమ్మడిదల : మండల కేంద్రంలో ఆషాఢ మాస బోనాలను వైభవంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి విశేష పూజలను చేశారు. మహిళలు డప్పువప్పుళ్లతో పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేసి గ్రామదేతకు బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడమటి లక్ష్మారెడ్డి, పాలకవర్గ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మంగళవారం ఎల్లమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

సిద్దిపేటలో..

సిద్దిపేట అర్బన్ : పట్టణంలోని దీకొండ మైసమ్మ ఆలయం, కోటిలింగాల ఆలయం సమీపంలో భక్తులు బోనాలను సమర్పించారు. మైసమ్మ ఆలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామ్, సతీష్, విజయ్, కౌన్సిలర్ బుచ్చిరెడ్డి, నాయకులు మున్నా కలీం, మంద పాండు తదితరులు పాల్గొన్నారు.

రాయపోలులో ఎడ్లబండ్ల ఊరేగింపు

రాయపోల్ : రాయపోల్ మండలం బేటంపేటలో మహంకాళమ్మ, పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవార్లకు బోనాలు సమర్పించా. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. బేగంపేట గ్రామంలో జరుగుతున్న మహంకాళమ్మ ఉత్సవాల్లో చిన్నారులు తీసుకొచ్చిన చిన్న బండి అందరినీ ఆకట్టుకున్నది. అప్పాయపల్ల గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు చిన్న ఎడ్ల బండిని ప్రత్యేకంగా తయారుచేసి వారే స్వయంగా లాక్కొని బేగంపేటకు తీసుకొచ్చి అమ్మవారి ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

గడిమైసమ్మ ఆలయంలో

చేర్యాల: కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో గడిమైసమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఐదేళ్లకో సారి అమ్మవారి కల్యాణం జరుపడం గ్రామంలో ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో గండిమైసమ్మతల్లికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి తెల్లవారుజామున జంతుబలి చేసి కల్యాణం జరిపారు.


ఫలాల అలంకరణలో దుర్గమ్మ

ఫలాంబరి రూపంలో వనదుర్గామాత

పాపన్నపేట, జూలై 21 : జగత్ జనని ఏడుపాయల వనదుర్గభవానీ మాతను ఆషాఢ మాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకుని రకరకాల పండ్లతో అలకంరించారు. ఫలాంబరి దేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఏడుపాయలకు సుదూర ప్రాంతాల నుంచి వేకువజామున నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో జాతరను తలపించింది. భక్తులు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చన, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏడుపాయల చైర్మన్ సత్తెల్లి బాలాగౌడ్, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

దుబ్బాకలో కత్తికార్తీక పూజలు

దుబ్బాక: దుబ్బాక మండలం గంభీర్‌పూర్‌లో రెడ్డి, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహంకాళి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను వీధులగుండా ఊరేగించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తికార్తీకగౌడ్ పూజలు చేశారు. కార్యక్రమంలో మున్నూరుకాపు, రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో శాకాంబరీ పూజ

హుస్నాబాద్ : హుస్నాబాద్ పట్టణంలోని వైశ్య భవన్‌లో ఆషాడమాసాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి శాకాంబరీ పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోరింటాకు సంబురాలు జరుపుకున్నారు.

కోహెడలో నైవేద్య సమర్పణ

కోహెడ : మండల కేంద్రంలో పద్మశాలీ, నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకొని మహిళలు పోచమ్మ ఆలయానికి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.


రాయపోల్ మండలం బేగంపేటలో ఎడ్లబండ్ల ఊరేగింపు




జహీరాబాద్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హుస్నాబాద్‌లోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శాకాంబరీ పూజలు నిర్వహిస్తున్న మహిళలు, కోహెడలో పోచమ్మకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

హైవేపై డేంజర్‌స్పాట్స్

- ఎన్‌హెచ్ 65పై ప్రమాదకరంగా చౌరస్తాలు
- హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేవు
- బ్రిడ్జీల వద్ద నిర్మించని సర్వీసు రోడ్లు




65వ నంబర్ జాతీయరహదారిపై ప్రమాదకరంగా మారిన హుగ్గెల్లి, అల్గోల్, రాయిపల్లి చౌరస్తాలు

జహీరాబాద్, జూలై 21 : జహీరాబాద్ ప్రాంత రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. 65వ నంబరు జాతీయరహదారిని నాలుగులేన్ల రోడ్డుగా మార్చినప్పటికీ చౌరస్తాలు ప్రమాదభరితంగా తయారయ్యాయి. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలను నడపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. గతంలో జహీరాబాద్ పట్టణం మీదుగా ముంబయి రహదారి ఉండడంతో వాహనాల రద్దీ అధికంగా ఉండేది. పక్క నుంచి బైపాస్ రోడ్డు వేయడంతో పట్టణంలో కొంతమేరకు ట్రాఫిక్ తగ్గింది. ఈ బైపాస్‌పైనా వాహనదారులు అతివేగంతో నడుపుతుండడంతో ప్రమాదకరంగా మారింది. ఎల్‌అండ్‌టీ పరిధిలో ఉన్న ఈ 65 నంబరు జాతీయ రహదారిపై సంస్థ వారు ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టలేదు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

బ్లాక్‌స్పాట్‌లు

నియోజకవర్గంలోని కోహీర్ మండలం కొత్తూర్(డి) మొదలుకుని మొగుడంపల్లి మండలం మాడ్గి చౌరస్తా వరకు సుమారు 45 కిలోమీటర్ల మేర జహీరాబాద్ మీదుగా 65వ నంబరు జాతీయ రహదారి ఉంది. కొత్తూర్(డి), చింతలగట్టు చౌరస్తా, దిగ్వాల్, రాయిపల్లి(డి), హుగ్గెల్లిచౌరస్తా, జహీరాబాద్ పట్టణంలోని ఇంద్రప్రస్థాన్ వద్ద, అల్గోల్ చౌరస్తా, బూడ్డిపాడ్‌చౌరస్తా, సత్వార్‌చౌరస్తా, అసద్‌గంజ్ ఈ చౌరస్తాలను అధికారులు బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. ఆయా కూడళ్ల వద్ద వాహనాల వేగ నియంత్రణను కట్టడి చేస్తే కొంత మేర ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. చౌరస్తాల వద్ద లైట్లు సరిగ్గా పనిచేయకపోవడం, హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదకరంగా మారాయి. సమీపాల్లోని గ్రామాల ప్రజలు వివిధ ప్రాంతాలకు ద్విచక్రవాహనాలతో, కాలినడకన రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చే వాహనదారులకు సరిగ్గా కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా చౌరస్తాల వద్ద ప్రతీ ఏటా 25 వరకు ప్రమాదాలు జరుగుతున్నాయి. జహీరాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వరాలయం వద్ద సర్వీస్ రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జిలను ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఎల్‌అండ్‌టీ అధికారులు సర్వీస్ రోడ్లను పునరుద్ధరించాలని స్థానికులు కోరతున్నారు.

వాహనదారులు జాగ్రత్తగా నడపాలి



వాహనదారులు జాగ్రత్తగా నడపాలి. అతివేగం, అజాగ్రత్తతో ప్రమాదాలకు గురై అవకాశం ఉంది. పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. పోలీసు వాహనాలు కూడా ప్రధాన రోడ్లపై తరచూ తిరుగుతున్నాయి. ప్రధాన చౌరస్తాలను దాటి వెళ్తున్న క్రమంలో కాస్త తమ వాహనాన్ని ఆపి అటు, ఇటు చూసి వాహనాలు రాకపోతే రోడ్డును దాటాలన్నారు. వాహనం దూరంగా ఉందికదా అనుకుని నిర్లక్ష్యంగా వెళితే ప్రమాదంలో పడాల్సి వస్తుంది. రాంగ్‌రూట్‌లలో వెళ్లడం,హెల్మెట్ లేకుండా వాహనాలను నడపడం, యూటర్న్ విధానం పాటించకపోవడం, అటు ఇటు చూస్తూ ముందు వెళ్తున వారిని గమనించకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి.

- రామ్మోహన్‌రెడ్డి, డీఎస్పీ


హైవే 65 ఉన్న మాడ్గి చౌరస్తా

బాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు

● గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

● భక్తులకు అన్నదానం

గజ్వేల్, జూలై 21: గజ్వేల్ పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హౌజింగ్ బోర్డు సాయిబాబా ఆలయంలో, లక్ష్మీప్రసన్ననగర్ కాలనీ లోని శ్రీశేషసాయి మోక్షమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలకు డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై, స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆయా ఆలయకమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

● **చేర్యాల:** వ్యాసమహర్షి జయంతిని పురస్కరించుకుని ఆదివారం చేర్యాలలో గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. పుష్పార్చన, విశేషాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు. అలాగే వ్యాసమహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **బెజ్జంకి:** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా అలకరించారు. సాయి నామ స్మరణతో ఆలయం మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేసి అన్నదానం చేశారు.

● **కుకునూరుపల్లి:** గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలోని వేపచెట్టు హనుమాన్ ఆలయంలోని షిర్డీ సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. భగవాన్ శ్రీసత్య సాయి జన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

● **వర్గల్:** వర్గల్ విద్యాధరి క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర సిద్ధాంతిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి పాదపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దాచేపల్లి వెంకటకృష్ణ, పొద్దుటూరి నర్సింహరావు, బొమ్మిడాల సత్యనారయణ, గంగిశెట్టి సుధాకర్, వెంకటరాంరెడ్డి, వాసుగుప్తా, రేణికుంట శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.



సిద్దిపేట అర్బన్: సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం సాయిబాబాకు విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

● **కోహెడ:** మండల కేంద్రంలో గ్రామ దేవత పోచమ్మకు ఆదివారం బోనాలు సమర్పించారు. పద్మశాలి, నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకుని మహిళలు ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని బోనాల నైవేద్యాన్ని సమర్పించారు.



బెజ్జంకి: సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

● **మిరుదొడ్డి:** అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె శ్రీవెంకటేశ్వరాలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఆలయంలో యజ్ఞాన్ని నిర్వహించారు. చిట్టాపూర్‌గ్రామంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

● **సిద్దిపేట అర్బన్:** గురుపౌర్ణమి సందర్భంగా సిద్దిపేటలోని సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

● **హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని సాయిబాబా ఆలయంలో భక్తులు పూజలు చేశారు. గురువులను పూజించే రోజును పురస్కరించుకుని పట్టణంలో ధర్మయోగ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న గురువు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితను యోగ శిక్షణ పొందుతున్న మహిళలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్లు పద్మ, వాల సుప్రజ, బోజు రమాదేవి ఉన్నారు.

●**కొండపాక:** గురువు జ్ఞానస్వరూపుడై అంతఃకరణం ద్వారా మంచి చెడులను సూచిస్తుంటాడని నిరంతరం మంచిని ఆచరిస్తూ ధర్మబద్ధమైన జీవనం గడపడమే గురు దక్షిణ అని విజయదుర్గా ఉపాసకులు చెప్పెల హరినాథశర్మ అన్నారు.



గజ్వేల్: పూజలు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



వర్గల్: విద్యాసరస్వతీ ఆలయంలో పూజలు చేస్తున్న వేద పండితులు



చేర్యాల: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రైతన్నల ఆత్మబంధువు సీఎం రేవంత్‌రెడ్డి

● టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి



చేర్యాల: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి రాజిరెడ్డి

చేర్యాల, జూలై 24 : సీఎం రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడని, ఇచ్చిన హామీమేరకు పంటరుణమాఫీ అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏకకాలంలో రుణమాఫీ నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని పేర్కొన్నారు.

● **సిద్దిపేటరూరల్:** ప్రభుత్వం రైతన్నలను అప్పుల ఊబి నుంచి ఆశల సాగుక్షేత్రం వైపు నడిపించే బృహత్తర సాహసమే రుణమాఫీ అని కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బండి శివకుమార్ పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రావురూకులలో ఆదివారం రైతులు, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బండి శివకుమార్ మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వ పాలనలో రైతాంగం కోసం ఎంత కష్టమైన, భారమైన రెండు లక్షల రూపాయల పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బోడ పర్శయ్య, మాజీ ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు ఆశోక్, కొమ్ము రాజు, రాము, రైతులు రామలింగారెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్:** రుణమాఫీతో అన్నదాతల కుటుంబాల్లో ఎనలేని ఆనందం నెలకొన్నదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పడాల రాములు పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. భూమి ఉన్న ప్రతీ రైతుకు రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ అవుతుందని, రైతులు ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు.

'రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి'

మద్దూరు/చేర్యాల/రాయపోల్/కొండపాక, జూలై 21: మద్దూరు ఉమ్మడి మండలంలో జూన్ 28 వరకు కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన 3041 మంది రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బూరెల రామకృష్ణ తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడారు. రైతుబీమాకు దరఖాస్తు చేసుకునే వారు 1965 ఆగస్టు 14 నుంచి 2006 ఆగస్టు 14 లోపు జన్మించి ఉండాలన్నారు. రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్‌తతో పాటు నామిని ఆధార్ జిరాక్స్ ప్రతులతో క్లస్టర్ వారిగా ఏఈవోలకు ఆగస్టు 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తతఒకే రేషన్‌కార్డు పరిధిలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రూ.1లక్ష పంట రుణమాఫీ పొందని రైతులు దరఖాస్తు చేసుకోవాలని చేర్యాల వ్యవసాయాధికారి అఫ్రోజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడవేరుగు, పోతిరెడ్డిపల్లి, తాడూరు, చిట్యాల, దానంపల్లి గ్రామాల్లో ఏఈవోలు లేనందున నేరుగా వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కొత్తగా పట్టాదార్ పాస్‌బుక్ వచ్చిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని రాయపోల్ మండలం అనాజీపూర్ ఏఈవో కవిత సూచించారు. జూన్ 28వ తేదీ లోపు కొత్తగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులందరూ పూర్తి వివరాలను ఆగస్టు 5వ తేదీ లోపు సంబంధిత ఏఈవోలకు అందజేసి రైతుబీమా పొందాలని సూచించారు. అర్హులైన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని కొండపాక వ్యవసాయశాఖ అధికారిని ప్రియదర్శిని తెలిపారు.



మండల కేంద్రంలోని గీతాశ్రమ పాఠశాలలో 2001-02 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 22 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకున్నారు. మండల కేంద్రంలోని ఓ భవన్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆటపాటలతో సందడిగా గడిపారు. పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు

\- బెజ్జంకి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తూప్రాన్, జూలై 21: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ఒగడి మంగబాడి గ్రామానికి చెందిన నాగోరావ్ హన్మండ్లు రాఫన్‌వార్(40) జీవనోపాధి కోసం నాలుగు నెలల క్రితం తూప్రాన్‌కు వచ్చాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18న రాత్రి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్ద రోడ్డు దాటుతుండగా శివ్వంపేట వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాఫన్‌వార్‌ను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య అనిత నాగోరావ్ రాఫన్‌వార్ ఫిర్యాదు మేరకు కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా కడు బీదరికంలో ఉన్న మృతుడి కుటుంబీకులను చూసిన కానిస్టేబుల్, హన్మాండ్లు అంత్యక్రియలకు రూ.5 వేలు ఇచ్చి మానవత్వం చాటుకున్నారు.

బోగస్ ప్రచారాలను కాంగ్రెస్ మానుకోవాలి

● సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 21: లక్ష రూపాయల రుణమాఫీ చేశామంటూ కాంగ్రెస్ చేస్తున్న బోగస్ ప్రచారాలను ఇకనైనా మానుకోవాలని సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి ఒక ప్రకటనలో హితవుపలికారు. ఆడంబరంగా సంబరాలు చేస్తూ రైతు రుణమాఫీ చేశామని గొప్పలు చెప్తున్న తీరుతో రైతులంతా ఆగ్రహంతో ఉన్నారని, 40 శాతం రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని దుయ్యబట్టారు. సమయం వచ్చినప్పుడు రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

శివాలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

జిన్నారం, జూలై 21: మండల కేంద్రం జిన్నారంలో నిర్మిస్తున్న శివాలయానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.3 లక్షల విరాళం అందజేశారు. ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మాణ కమిటీ సభ్యులకు హైదరాబాద్‌కు చెందిన రాకేష్‌గోయల్, దినేష్‌గోయల్ కుటుంబం తరఫున విరాళం అందజేశారు. ఆలయం అభివృద్ధికి తమ సహకారం అందిస్తామని వారు తెలిపారు.

పదోరోజుకు రైతుల దీక్షలు

నర్సాపూర్, జూలై 21: తమకు న్యాయం జరిగే వరకు దీక్ష విరమించేది లేదంటూ రైతులు చేపట్టిన దీక్ష ఆదివారం పదోరోజుకు చేరింది. ఉదయం నుంచి ముసురుతో కూడిన వర్షం వస్తున్నా లెక్క చేయకుండా రైతులు దీక్ష చేపట్టారు. పదిరోజులుగా తాము దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని రైతులు వాపోయారు. ఈ దీక్షలో పెద్దచింతకుంట, చిన్నచింతకుంట రైతులు నరిసింహారెడ్డి, రాజమౌళి, పోచయ్య, ప్రేమ్‌చరన్ పాల్గొన్నారు.

మార్మోగిన ఏసు నామస్మరణ

మెదక్ కల్చరల్, జూలై 21: మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం సందడి నెలకొన్నది. ఉదయమే శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిష్ఠించిన అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మొదటి ఆరాధన డేవిడ్ రిచర్డ్, రెండో ఆరాధనలో ప్రెసిబీటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశాన్ని భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో భాగంగా అభిషిక్త గురువులను కేథడ్రాల్ ఆఫీస్ బేరర్స్, సంపత్ సన్మానం చేశారు.

గంజాయి నిందితుడి ఆచూకీ తెలపండి: ఎస్‌ఐ

చేగుంట: గంజాయి కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఆచూకీ తెలియజేయాలని ఎస్‌ఐ బాల్‌రాజు కోరారు. మెదక్ జిల్లా నార్సింగి గ్రామానికి చెందిన మల్లప్పగారి శ్రీకాంత్‌రెడ్డి 2017లో తమిళనాడు రాష్ట్రంలో గంజాయి కేసులో పట్టుబడి.. కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. అతడి ఆచూకీ తెలిసినవారు చేగుంట పోలీస్‌స్టేషన్‌కు సమాచారమందించాలని ఎస్‌ఐ కోరారు.

విద్యా రంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

సిద్దిపేట అర్బన్, జూలై 21: గత ప్రభుత్వం విద్యార్థులను విస్మరించి అన్యాయం చేస్తే ప్రస్తుత ప్రభుత్వం కూడా విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని విద్యార్థి సంఘం నాయకుడు విద్యానాథ్ ఆరోపించారు. సిద్దిపేటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

చేర్యాల, జూలై 21: పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు కొమురవెల్లి మండలం ఐనాపూర్‌కు చెందిన ఏర్పుల యాదగిరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు. కొమురవెల్లి గ్రామశివారులో డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేసి యాదగిరిని విచారిస్తుండగా పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడని, ఈవిషయమై అతడి పై కేసున మోదు చేసినట్లు తెలిపారు.

యోగాతో వ్యాధులు దూరం

నర్సాపూర్, జూలై 21: యోగా వల్ల ఎలాంటి వ్యాధులు దరిచేరవని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యోగా గురువు భైరయ్య పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్‌లోని ఓ గార్డెన్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపౌర్ణమి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు చంద్రశేఖర్, సురేందర్‌గౌడ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జైపాల్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి మాణిక్యం, క్లబ్ ప్రతినిధులు నర్సింహారెడ్డి, బుచ్చేస్ యాదవ్, రాములు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

చేర్యాల/అల్లాదుర్గం/శివ్వంపేట, జూలై 21: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణ శివారులో చోటుచేసుకున్నది. బీర్ల సిద్ధయ్యకు చెందిన కాడెద్దు వ్యవసాయబావి వద్ద గడ్డి మేస్తూ ప్రమాదతతవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఆవరణలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రూ.80వేలు నష్టం వాటిల్లిందని బోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని సిద్ధయ్య కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు, పాడి గేదె మృతిచెందాయి. అల్లాదుర్గం మండలం గొల్లకుంట గిరిజనతండాకు చెందిన విస్లావత్ రవీందర్‌కు చెందిన పశువులు మేతకు వెళ్లి తిరిగి వస్తున్నాయి. ఈ క్రమంలో ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సపోర్టు వైరు ఎద్దుకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు వాపోయాడు. శివ్వంపేట మండల పరిధిలోని వెంక్యాతండాకు చెందిన గుగులోత్ పాండు పాడిగేదె బీడు పొలంలో గడ్డి మేస్తుండగా ఎల్‌టీ వైర్ తెగి విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతున్నది. స్తంభానికి తాకిన గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని రైతు వాపోయాడు.

మద్దతు ధర చట్టంపై చర్చించాలి

● ఎంపీకి వినతిపత్రం అందజేసిన నాయకులు



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మిరుదొడ్డి, జూలై21: పంటలకు మద్దతు ధర చట్టంపై పార్లమెంట్‌లో చర్చించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి ఆదివారం సంయుక్త కిసాన్‌మోర్చ రాష్ట్ర కన్వీనర్ పద్మ, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్, తెలంగాణ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్‌లు వినతిపత్రాన్ని అందజేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

● ఏఎస్‌ఐ జగదీశ్వర్



సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వారిన సన్మానిస్తున్న పోలీసులు

మద్దూరు, జూలై 21: ఆలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతల సహకారం అభినందనీయమని ఏఎస్‌ఐ జగదీశ్వర్ అన్నారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేబర్తి, దూళిమిట్ట మండలం భైరాన్‌పల్లి గ్రామాల్లోని పెద్దమ్మ, దుర్గామాత ఆలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసిన పెద్దలను సిబ్బందితో కలిసి సన్మానించారు. అనంతరం ఏఎస్‌ఐ మాట్లాడారు. పోలీసుల సూచనల మేరకు గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల పనితీరుపై పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బందితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

శివ్వంపేట, జూలై 21: గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా గూడూరులోని గురు పీఠం బాలలాయంలో ఆదివారం చైర్మన్ శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో వేదపండితుడు వెంకటేశ్వరశర్మ సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 19 మంది దివ్యాంగులకు గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ రమాదేవిశివకుమార్‌గౌడ్ దంపతులు సుమారు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

ఔటర్ సర్వీసు రహదారిపై వర్షపు నీటితో ఇక్కట్లు

జిన్నారం, జూలై 21: మండలంలోని కాజీపల్లి శివారు ఔటర్ రింగ్ రోడ్డు సర్వీసు రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారని జేఏసీ అధ్యక్షుడు రమాకాంత్ తెలిపారు. వారంరోజులుగా బ్రిడ్జిల కింద వర్షపు నీరు నిలిచి ప్రయాణాలు చేసే పరిస్థితి లేదన్నారు. అధికారులు స్పందించి వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీలను ప్లేస్కూళ్లుగా మార్చడాన్ని విరమించుకోవాలి

● డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి

గజ్వేల్, జూలై 21: అంగన్వాడీలను ప్లేస్కూళ్లుగా మార్చే ప్రక్రియను విరమించుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అంగన్వాడీలను ప్లేస్కూళ్లుగా మార్చి 3వ తరగతి వరకు అక్కడే చదువుకోవాలన్న ప్రభుత్వ ప్రతిపాదన వల్ల ప్రాథమిక పాఠశాలలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. ఈ విధానం అమలైతే పిల్లల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మళ్లే ప్రమాదం ఉందన్నారు. ఆయనవెంట రాజు, భాను ఉన్నారు.

● **కొండపాక:** విద్యాశాఖ సమీక్ష సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో 3వ తరగతి వరకు విద్యా బోధన అమలు చేయాలని నిర్ణయించడం అనాలోచిత, అశాస్త్రీయ నిర్ణయమని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ, ప్రధాన కార్యదర్శి పి.రాజయ్య తీవ్రంగా ఖండించారు. విద్యా విధానంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంలో సీఎం తొందరపాటుగా వ్యవహరించడం తగదని, అంగన్‌వాడీ విధానానికి, ప్రాథమిక విద్యకు ఎటువంటి పొంతనలేదన్నారు. ప్రతీ గ్రామంలో ఐదు తరగతుల వరకు ప్రాథమిక విద్య అందించేందుకు ఇంకా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విధానం తిరోగమన చర్య అవుతుందని, తక్షణమే దానిని ఉపసంహరించుకుని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులను నియమించడానికి చర్యలు చేపట్టాలని కోరారు.



గజ్వేల్: మాట్లాడుతున్న ఏగొండస్వామి

దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ పీఠం ఎవరికి దక్కేనో?

● చైర్మన్ రేసులో 8 మంది

దౌల్తాబాద్, జూలై 21: ఎమ్మెల్యే హోదా తర్వాత మంచి ప్రోటోకాల్, హోదా కలిగిన పదవి ఏదైనా ఉందంటే అది మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి అని చెప్పక తప్పదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి పని చేసిన నాయకులు చాలా మంది ఉన్నారు. ఈ సారి దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్ కేటగిరీకి కేటాయించడంతో దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు ఆశావహులు పోటీ పడుతున్నారు. చైర్మన్ పదవి ఎంపిక ఆలస్యం అవుతుండడంతో నాయకుల్లో రోజురోజుకు ఉత్కంఠ పెరిగిపోతున్నది. అలాగే ప్రతీసారి చైర్మన్ పదవి రాయపోల్ మండలానికి చెందిన నాయకులకే దక్కుతుండడంతో ఈసారి చైర్మన్ పదవి కోసం దౌల్తాబాద్ మండలానికి చెందిన నాయకులు చాలామంది పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఏదైమైనా చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో వేచి చూడాలి.

ఎవరికి అవకాశం కల్పిస్తారో

దౌల్తాబాద్ మండలం నుంచి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పడాల రాములు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు దశరథరెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు బండారులాలు, కాంగ్రెస్ మండల ఉపాధ్యాక్షుడు మద్దేల స్వామి, జనాగాం మాల్లారెడ్డి, రాయపోల్ మండలానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లపల్లికనకయ్య, కిష్టరెడ్డి, తదితరుల పేర్లు మార్కెట్ కమిటీ చైర్మన్ రేసులో ఉన్నాయని తెలుస్తున్నది. వీరందరూ కాంగ్రెస్ కోసం నిరంతరం కష్టపడి పని చేసిన వాళ్లు కావడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండ సురేఖ, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి ఎవరికి అవకాశం కల్పిస్తారో ఉత్కంఠ నెలకొన్నది.



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మార్కెట్ చైర్మన్ పదవిని అమ్ముకున్న కొమ్మూరి : సీపీఎం

చేర్యాల, జూలై 21: జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వ్యవసాయమంటే తెలియని వారికి చేర్యాల వ్యవసాయమార్కెట్ చైర్మన్ పదవిని అమ్ముకోవడం తగదని సీపీఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రైతాంగానికి సేవచేయాల్సిన చేర్యాల మార్కెట్ చైర్మన్ పదవిని రూ.55లక్షలకు హైదరాబాదులో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పొరుగు జిల్లా వ్యక్తికి ప్రాధాన్యమిచ్చి స్థానిక పార్టీశ్రేణులకు ద్రోహం చేశారని విమర్శించారు. చేర్యాల ప్రాంతానికి దక్కాల్సిన పదవులకు బేరసారాలాడటం శోచనీయమని, వెంటనే మార్కెట్ చైర్మన్‌గా చేర్యాల ప్రాంతానికి చెందినవారికి అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, దర్శనం రమేశ్, భాస్కర్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో

అసంపూర్తిగా డ్రైనేజీ పనులు

● రోడ్లపై నిలుస్తున్న మురుగునీరు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బెజ్జంకి, జూలై 21: అధికారుల అలసత్వం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మండల కేంద్రంలో చేపట్టిన డ్రైనేజీ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. పనులు పూర్తి కాకపోవడంతో ఇళ్ల మధ్యలో, రోడ్లపై మురుగునీరు నిలుస్తున్నది. మురుగునీరు చేరి దుర్వాసన వస్తుండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తప్పని ఇబ్బందులు

మండల కేంద్రంలో నెల రోజుల క్రితం చేపట్టిన డ్రైనేజీ పనుల కోసం నివాసాల పక్క నుంచి కాలువ తీసి మురుగు నీరు వెళ్లేందుకు పైప్‌లైను వేశారు. సరైన ప్రణాళిక లేక వేసిన పైపులైన్లను అసంపూర్తిగా వదిలేయడంతో మురుగునీరు ఇళ్ల మధ్యనే నిలుస్తున్నది. దీనికి తోడు పారిశుధ్య నిర్వహణ లేక దోమల బెడద ఎక్కువయింది. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇంటి నుంచి బయటికి వెళ్లేటప్పుడు, ఇంట్లోకి వచ్చేటప్పుడు కాలువలను దాటలేక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. కాలనీవాసులు, ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

పారిశుధ్య నిర్వహణ కరువు

మండల కేంద్రంలో ఉన్న కాలనీల్లోని పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం నిండి ఉన్నా వాటిని తొలగించడంలో అలసత్వంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. కాలనీలోని మంచినీటి ట్యాంకుల వద్ద చెత్త పేరుకుపోయి ఉన్నా తొలగించకుండా వదిలేస్తున్నారు. మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెబుతున్న అధికారులు వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉన్న పారిశుధ్య నిర్వహణపై మాత్రం శ్రద్ధ చూపడంలేదు. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ పనులను త్వరగాపూర్తి చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బెజ్జంకిలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



పారిశుధ్య నిర్వహణ లేక డ్రైనేజీల నుంచి మురుగునీరు రోడ్లపైకి, సమీప ఇళ్లలోకి వస్తూ దుర్వాసన వెదజలుతున్నదని ఎంపీడీవోకు, పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ పనులను త్వరగా పూర్తిచేసి పారిశుధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

\- సంగెం మధు, బెజ్జంకి గ్రామస్థుడు